సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం | 24 | డిసెంబర్ | 2024



ప్రజావాణికి వినతులు
హనుమకొండ, వరంగల్ కలెక్టరేట్లలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులు వినతులు స్వీకరించారు. - 8లో



పలు రైళ్ల రద్దు
వరంగల్–విజయవాడ మధ్య మోటమర్రి సెక్షన్‌లో మూడో రైల్వే లైన్, ఇంజనీరింగ్ బ్లాక్‌తో పలు రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. - 8లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం $29^0/18^0$
జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మెరుగైన వైద్య సేవలందించాలి



హన్మకొండ చౌరస్తా: ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఈహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ వైద్యులను హనుమకొండ డీఎంహెచ్‌ఓ అప్పయ్య ఆదేశించారు. హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోని వెల్‌నెస్ సెంటర్, టీహబ్, బ్లడ్ బ్యాంకులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. టీహబ్‌కు వస్తున్న శాంపిళ్లు, పరీక్షల నిర్వహణ, రిపోర్టులను పరిశీలించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ అప్పయ్య మాట్లాడుతూ.. టీహబ్‌కు 34 ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి నిత్యం శాంపిళ్లు వస్తుంటాయన్నారు. కలెక్టర్ ఆదేశాలతో వెల్‌నెస్ సెంటర్‌లో ఇద్దరు డాక్టర్లను నియమించినట్లు పేర్కొన్నారు.

రాత పరీక్ష రద్దు చేయాలని ఆందోళన



హన్మకొండ అర్బన్: ఎంపీహెచ్‌ఏ(ఎఫ్) పోస్టులు పదేళ్లుగా చేపడుతున్నట్లుగానే భర్తీ చేయాలని, ఈనెల 29న నిర్వహించనున్న పరీక్షను రద్దు చేయాలని ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. తెలంగాణ వైద్య ఆరోగ్య ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట వారు ఆందోళన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 294 ఖాళీలున్నాయని, వాటిని రిజర్వేషన్, రోస్టర్ సీనియార్టీ ఆధారంగా వెయిటేజీ ఇచ్చి భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన పరీక్ష విధానంతో 40 ఏళ్లు పైబడినవారు అర్హత పరీక్ష రాసే పరిస్థితి లేదని, మరి కొందరు వయసు రీత్యా ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పరీక్షలు రాయలేరని పేర్కొన్నారు. ధర్నాలో చంద్రకళ, శ్రీవాణి, రజిత, నర్మద, జ్యోతి, సుజాత, కోమల, అంజమ్మ ఉన్నారు.

‘అనధికారిక లీజు’పై విచారణ



హసన్‌పర్తి: ‘అనధికారిక లీజు’ శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి నీటిపారుదల శాఖ అధికారులు స్పందించారు. హసన్‌పర్తి పరిధి ఎస్సారెస్పీ భూముల్లో లారీల పార్కింగ్, కుళాయి, షాపు ఏర్పాటుపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా అక్కడ వ్యాపారం కొనసాగిస్తున్న చిరువ్యాపారిని మందలించారు. కాగా.. తాను నెలకు రూ.6.500లు అద్దె చెల్లిస్తున్నానని అతడు చెప్పడంతో అధికారులు షాక్‌కు గురయ్యారు. రెండు నెలల నుంచి అద్దె చెల్లిస్తున్నట్లు అతడు అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఇంటి నంబర్ లేకుండా నల్లా కనెక్షన్ ఇలా ఇచ్చారని? కార్పొరేషన్ సిబ్బందిని అధికారులు ప్రశ్నించారు. వెంటనే సీజ్ చేయాలని ఆదేశించారు. ఇక్కడి నుంచి లారీలను ఖాళీ చేయకపోతే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని హెచ్చరిండంతో లారీలను అక్కడి నుంచి తీసుకెళ్లారు. డీఈఈ రాజు, ఏఈఈ శ్రీనివాస్ ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కేయూ క్యాంపస్: యువత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలను, మత్తుపదార్థాలను విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని యాంటీ నార్కోటిక్ డీఎస్పీ సైదులు ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో కేయూ పాలక మండలి సభ్యులు కె.అనితారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.జ్యోతి, డాక్టర్ జగదీశ్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ ఆచార్యులు ఈసం నారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేశ్ పాల్గొన్నారు.

అతిక్రమణలు.. ఆమ్యామ్యాలు!

నగరంలో ఇష్టారీతిన భవన నిర్మాణాలు

అనుమతులు పొందలేక..

నూతన భవన నిర్మాణాల ఫీజుల భారం, ప్లానింగ్ నిబంధనల అమలుపై అపోహలు, యంత్రాంగం కొర్రీలు, సర్వేయర్ల చార్జీలు ఇచ్చుకోలేక.. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయలేక భవన యజమానులు నిబంధనలు అతిక్రమిస్తున్నారు. ఇష్టారీతిన నిర్మాణాలకు పాల్పడుతున్నారు. ఇదే అదునుగా ఒకవైపు స్థానిక కార్పొరేటర్లు, మరోవైపు టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది చేతులు చాస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఇంటి పన్ను పేరుతో వందకు రెండు వందల శాతం ఫీజులను యజమానుల నుంచి వసూలు చేస్తున్నారు. హైదరాబాద్ తరహాలో వరంగల్‌లో కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు అన్నీ తెలిసినా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



- చేతులు చాస్తున్న కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది
- చూసీచూడనట్లుగా కమిషనర్, ఉన్నతాధికారులు

వరంగల్ అర్బన్: అనుమతుల్లేని భవనాలు, అదనపు అంతస్తుల నిర్మాణాలపై కోర్టులు ఆదేశిస్తేతప్ప పనిచేయరా? ..అని ఇటీవల హైకోర్టు జస్టిస్ కె.లక్ష్మణ్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే తరహాలో కోర్టులు ఆదేశిస్తే తప్ప గ్రేటర్ వరంగల్‌లోనూ ఆక్రమణలు, అతిక్రమణలు ఆగే పరిస్థితి కనిపించడం లేదు. వరంగల్ మహానగరంలో భవన యజమానులు నిబంధనలు అతిక్రమించి ఇష్టారీతిన నిర్మాణాలకు పాల్పడుతున్నారు. ఆ తర్వాత అధికారుల దృష్టికి రావడంతో అదనపు భారాన్ని భరిస్తున్నారు. అధికారికంగా నిర్మాణాలు చేపట్టాలంటే.. సవాలక్ష నిబంధనలు అడ్డొస్తున్నాయి. అదే అతిక్రమిస్తే అన్ని చేతులూ ఏకమవుతున్నాయి. నిబంధనలు గాల్లో కలిసిపోతున్నాయి. వెరసి అనువుగాని చోట ప్రమాదాల భవంతులు వెలుస్తున్నాయి.

అక్రమ నిర్మాణాలు ఎక్కడంటే..
ప్రధానంగా ట్రైసిటీ శివారులోని భీమారం, పలివేల్పుల, కోమటిపల్లి, హసన్‌పర్తి, ఆరెపల్లి, మడికొండ, రాంపూర్, భట్టుపల్లి, కడిపికొండ, ఫించన్‌పురా,



పోతననగర్ రోడ్డులో వెలిసిన నిర్మాణాలు

ఏనుమాముల, పైడిపల్లి, కొత్తపేట, ఆరెపల్లి, వంగపహాడ్, హసన్‌పర్తి, గొర్రెకుంట, ధర్మారం, తిమ్మాపూర్, స్తంభంపల్లి, బొల్లికుంట ఇలా విలీన గ్రామాల్లో అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. కాజీపేట ప్రశాంత్‌నగర్, ఎఫ్‌సీఐ కాలనీ, బంధం చెరువు, రామకృష్ణ కాలనీ, హంటర్ రోడ్, ప్రకాశ్ రెడ్డి పేట, నంది హిల్స్, మచిలీబజార్, కాపువాడ, కుమార్‌పల్లి, లేబర్ కాలనీ, దేశాయిపేట, కరీమాబాద్, సంతోషిమాత కాలనీ, సాయినగర్, రంగంపేట ప్రాంతాల్లో 42 విలీన గ్రామాల్లో పాత రికార్డుల అనుమతులు, తప్పుడు పత్రాలు, 1984, 2002 రికార్డులు లేవని, అధికారుల తప్పిదమేనని తామేం చేయాలని నిర్మాణాలు చేస్తున్నారు. వీటి వెనుక కార్పొరేటర్ల హస్తం ఉండడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని తెలిసింది. ఇదే విషయమై టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారిని వివరణ కోరితే వివరాలు వెల్లడించకూడదని కమిషనర్ నుంచి ఆదేశాలున్నాయని దాటవేశారు.

అందినకాడికి దండుకోవడమే..

2019 నుంచి టీఎస్–బీపాస్ అమల్లోకి వచ్చింది. ‘ఆన్‌లైన్’ ద్వారా మాత్రమే అనుమతులు పొందాలి. కానీ.. కొంత మంది ప్లాన్‌లు ఒక రకంగా సమర్పించి.. నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమ భవన నిర్మాణాల వ్యవహారంలో కొందరు కార్పొరేటర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. అక్రమ భవనాలకు అనుమతిలిచ్చే విషయంలో టౌన్ ప్లానింగ్ సిబ్బందికి నడుమ కార్పొరేటర్లు లేదా లైసెన్స్ సర్వేయర్లు దళారులుగా అవతారమెత్తారు. నగరంలో స్థలం ఎంతో ఖరీదు కావడంతో ఉన్న కొద్దిపాటి స్థలంలో నిబంధనల ప్రకారం భవనం చుట్టూ నిర్దేశిత ఖాళీ జాగా వదిలి నిర్మాణం చేపట్టడం కష్టంగా మారింది. దీంతో నిబంధనలు ఉల్లంఘించి చేపడుతున్న నిర్మాణాలు అవినీతి అధికారులకు, దళారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. తమ వాటాలు తమకు అందిస్తే సెలవు రోజుల్లో అక్రమ కట్టడాలు నిర్మాణాలు సాగించాలి. ఉచిత సలహాలు కూడా ఇస్తున్నట్లు సమాచారం. నగర ప్రణాళిక విభాగంలో పనిచేస్తున్న కొంత మంది సిబ్బంది, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది డాక్యుమెంటరీ, ఫీల్డ్ వెరిఫికేషన్ చేస్తున్నారు. వీరు అక్రమ నిర్మాణాలను చూసీచూడనట్లుగా వ్యవహరించకపోతే బదిలీలు తప్పవని కొంత మంది బెదిరింపులకు కూడా పాల్పడుతున్నారు. ఇవన్నీ ఎందుకంటూ క్షేత్ర స్థాయిలో ఆయా విభాగాల అధికారులు లైసెన్స్ సర్వేయర్లు, చైన్‌మెన్ల ద్వారా కూల్చివేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతూ అందినకాడికి దండుకున్నారు.

క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకం

- మంత్రి కొండా సురేఖ
- పాస్టర్లకు దుస్తుల పంపిణీ

వరంగల్: ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి మార్గదర్శకమని మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ ఓసిటీలోని తూర్పు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారదతో కలిసి మంత్రి కేక్ కట్ చేసి పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ క్రిస్టియన్ మైనార్టీల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ అన్ని మతాల సారాంశం మానవసేవయే మాధవసేవ అని అన్నారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ వినయం, కరుణను ఆచరణాత్మకంగా చూపిన వ్యక్తి ఏసుక్రీస్తు అని కొనియాడారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో క్రైస్తవులకు మంత్రి స్వయంగా వడ్డించారు. అంతకుముందు లేబర్ కాలనీ సీబీసీ చర్చి అభివృద్ధికి రూ.కోటి నిధుల జీఓను పాస్టర్లకు అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండు చందన, పల్లం పద్మ, బోగి సువర్ణ, బైరబోయిన ఉమ, సురేష్‌జోషి, చింతాకుల అనిల్‌కుమార్, పోశాల పద్మ, కావేటి కవిత, మరుపల్ల రవి, బాల్నే సురేష్, సోమిశెట్టి ప్రవీణ్‌కుమార్, ఫుర్ఖాన్, జిల్లా మైనార్టీ, బీసీ సంక్షేమ అధికారులు పుష్పలత, రమేష్ తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వరరావు, పాస్టర్లు జగ్జీవన్ బాబ్జి, పీఆర్.సాల్మన్, దీన్‌దయాళ్ పాల్గొన్నారు.



క్రైస్తవులకు ఏర్పాటు చేసిన విందులో వడ్డిస్తున్న మంత్రి సురేఖ, మేయర్ సుధారాణి

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి
వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలో జీడబ్ల్యూఎంసీ, ‘కుడా’, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయా అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షించారు. సమావేశంలో వరంగల్, హనుమకొండ కలెక్టర్లు డాక్టర్ సత్యశారద, పి.ప్రావీణ్య, బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఎఫ్‌ఓలు అనూజ అగర్వాల్, లావణ్య పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి సర్కారుది మొద్దునిద్ర

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సమగ్రశిక్ష ఉద్యోగులకు సంఘీభావం

విద్యారణ్యపురి: రాష్ట్రవ్యాప్తంగా సమగ్రశిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మె చేస్తూ.. దీక్షలు కొనసాగిస్తున్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొద్దు నిద్రపోతోందని రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు విమర్శించారు. హనుమకొండలోని ఏకశిల పార్కు వద్ద కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షకు సోమవారం సాయంత్రం హరీశ్‌రావు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023 సెప్టెంబర్ 13న ఇదే స్థలంలో మీరు (సమగ్ర శిక్ష ఉద్యోగులు) దీక్షలు చేస్తుంటే రేవంత్ రెడ్డి వచ్చి బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు కృషి చేయాలని కోరినట్లు గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు విస్మరించారన్నారు. 18 రోజులుగా దాదాపు 20 వేల మంది సమగ్రశిక్ష ఉద్యోగులు సమ్మె చేస్తుంటే పిలిచి మాట్లాడే సోయి లేదా? అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ఇదే విషయమై తాను అసెంబ్లీలో సీఎంను నిలదీసినట్లు గుర్తు చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని.. ప్రభుత్వంతో పోరాడతామన్నారు. హరీశ్‌రావు వెంట మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నరేందర్, బీఆర్‌ఎస్ బాధ్యులు యాదవరెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, ఎర్రోళ్ల శ్రీనివాస్, రాకేశ్‌రెడ్డి తదితరులున్నారు. దీక్షల శిబిరంలో సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం రెండు జిల్లాల అధ్యక్షులు దొనికల శ్రీధర్ గౌడ్, ఎండీ షఫీ ఉద్యోగులు ఉన్నారు.



మాట్లాడుతున్న టి.హరీశ్‌రావు, పక్కన ఎర్రబెల్లి దయాకర్‌రావు, వినయభాస్కర్ తదితరులు

బ్లాక్‌బెర్రీ.. ముస్తాబు



ములుగు జిల్లా తాడ్వాయి – ప్రసా మధ్యలో ఉన్న ఏటూరునాగారం అభయారణ్యంలోని జలగలంచ వాగు సమీపంలో గల బ్లాక్ బెర్రీ దీవిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నారు. ఎకో టూరిజంలో భాగంగా ఐదు ఎకరాల విస్తీర్ణంలోని ఇసుక మధ్యలో ఆధునిక గుడారాలు సిద్ధమయ్యాయి. రెస్టారెంట్, క్యాంప్‌ఫైర్, ఇసుకలో ఆటలు ఆడుకునేలా సిద్ధం చేస్తున్నారు. సోమవారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో దీవి కాంతులీనుతోంది. - ఎస్‌ఎస్‌తాడ్వాయి - 8లో

అమిత్ షా క్షమాపణలు చెప్పాలి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య

హన్మకొండ చౌరస్తా: అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. దళిత బిడ్డనైన తాను ఎంపీగా పార్లమెంట్‌కు వెళ్లానంటే అందుకు అంబేడ్కర్ ఇచ్చిన రిజర్వేషన్లే కారణమన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా నేడు(మంగళవారం) హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన, అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి, కలెక్టర్‌లో వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాసరావు, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు వెంకటేశ్వర్లు, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

కార్యకర్తలే పార్టీకి బలం: బీజేపీ

హన్మకొండ: కార్యకర్తలే పార్టీకి బలమని బీజేపీ సీనియర్ నాయకుడు, ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. సోమవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అధ్యక్షతన సంస్థాగత ఎన్నికల పరిశీలకులు, ఎన్నికల అధికారుల కార్యశాల నిర్వహించారు. తల్లోజు ఆచారి జ్యోతి వెలిగించి కార్యశాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదు, క్రియాశీలక సభ్యత్వ నమోదులో హనుమకొండ జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడంపై అభినందనలు తెలిపారు. రానున్న అన్ని ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలన్నారు. కార్యశాలలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి పెద్దోళ్ల గంగారెడ్డి, రాష్ట్ర నాయకులు చాడ శ్రీనివాస్ రెడ్డి, డా. పగడాల కాళీప్రసాద్, రావుల కిషన్, కాచం గురుప్రసాద్, డాక్టర్ పెసరు విజయ్ చందర్‌రెడ్డి, జిల్లా నాయకులు కొలను సంతోశ్‌రెడ్డి, ఆర్‌పీ.జయంత్ లాల్, దేశిని సదానందం గౌడ్, కొండి.జితేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆచారి

ఇక్కడ తప్పు చేసినా క్షమిస్తారు..!

- వరంగల్ జిల్లా సంక్షేమ విభాగ అధికారుల వింత పోకడ
- దత్తత విషయంలో నిబంధనలు పాటించకున్నా ఓకే
- ఇప్పటికే ‘సాక్షి’ వెలుగులోకి తెచ్చినా కదలిక కరువు



సాక్షి, వరంగల్: జిల్లా సంక్షేమ విభాగం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇక్కడ ఏం చేసిన ‘డోంట్ కేర్’ అంటూ అధికారులు పద్ధతి మార్చుకోవడం లేదు. గతంలో జరిగిన వీ హబ్ నియామకాల్లో అక్రమ పద్ధతిలో కొందరికి ఉద్యోగాలివ్వడం, అక్రమ పద్ధతిలో శిశువుల దత్తత విషయంలో అధికారులు నిబంధనలు పట్టించుకోకుండా దత్తత కోరుకునే తల్లిదండ్రులను ఇబ్బందులు పెడుతున్నారని.. బాధితుల వాయిస్‌తో సాక్షి ప్రత్యేక కథనాలు ఇవ్వడంతో ఉన్నతాధికారులు విచారణ చేశారు. ఈ రెండు అంశాల్లోనూ అప్పుడు నియామకాలు చేసిన అధికారుల ఉదాసీనతతో అర్హులకు అందలం ఎక్కించారని తేలినా, అధికారి శిశువుల దత్తత విషయంలో నిబంధనలు పాటించకుండా తనకు ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరించారని విచారణలో రుజువైనా.. ఇప్పటివరకు చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కించడంలో అంతర్యమేంటనే చర్చ జోరుగా సాగుతోంది. ఈ విభాగంలో తప్పు చేసినా.. అధికారులు క్షమించేస్తారన్న టాక్ ఉంది. పలువురి అధికారుల తీరుతో అర్హులకు అన్యాయం జరిగినా చర్యలు తీసుకోకపోవడంతో మిగతా విభాగాలకు కూడా తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయన్న చర్చ కలెక్టరేట్ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

వీ హబ్ నియామకాల్లోనూ అక్రమాలే..
కొత్త మిషన్ శక్తి పథకం కింద డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్‌కు సంబంధించి నాలుగు కాంట్రాక్ట్ బేస్ ఉద్యోగాలు గతేడాది జూలైలో నియామకాలు చేశారు. వీటిలో మూడింటిల్లో అంగన్‌వాడీ టీచర్ కోడలు, జిల్లా సంక్షేమ విభాగంలో పనిచేసే అకౌంటెంట్ భార్యకు మార్కులు తక్కువగా ఉన్నా, ఇంటర్వ్యూలో అధిక మార్కులిచ్చారు. వీరు సమర్పించిన అనుభవ పత్రాలు కూడా సరైనవి కావనే ఆరోపణలున్నాయి. తాజాగా ఇందులో ఒకరు నకిలీ పీజీ పత్రాలు ఇచ్చారని పోలీసు విచారణలో తేలడంతో ఆమె తెలివిగా రాజీనామా చేసి వెళ్లినట్లు తెలిసింది. అలాగే మరో పోస్టుకు సంబంధించి విద్యార్హత లేకున్నా ఆమెకు ఉద్యోగం కట్టబెట్టారని ప్రచారం ఉంది. వీటిపై కలెక్టర్ సత్య శారద లోతుగా దర్యాప్తు జరిపి అనర్హులను పక్కనబెడితే అర్హులకు న్యాయం జరిగే అవకాశం ఉంది. తప్పుడు పత్రాలు పెట్టి ఉద్యోగం పొందిన వారితో పాటు అవి క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరిపి క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

శోభాయమానం.. అనఘాష్టమి వ్రతం



అనఘాష్టమి వ్రత కలశాలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ ములుగు రోడ్డులోని దత్తక్షేత్రంలో సోమవారం అనఘాష్టమి వ్రతాన్ని శోభాయమానంగా నిర్వహించారు. దత్తప్రచారక్ కొక్కుల రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజల్లో వేలాది మంది భక్తులు పాల్గొని సామూహికంగా వ్రతం ఆచరించారు. ఈసందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం దత్తక్షేత్రంలో అనఘాష్టమి వ్రతం నిర్వహిస్తున్నట్లు, వేలాది మంది భక్తులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వైవీ వామన్‌రావు, లక్ష్మీనారాయణ, కృష్ణప్రసాద్, అర్జున్‌రావు పాల్గొన్నారు.

వేగంగా పరిష్కారం చూపండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్: గ్రేటర్ పరిధి ప్రజలు అందిస్తున్న అర్జీలకు వేగంగా పరిష్కారం చూపాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో కమిషనర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈసందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారీగా ఇంజనీరింగ్ 15, హెల్త్–శానిటేషన్ 5, ప్రాపర్టీ టాక్స్ (రెవెన్యూ) 6, టౌన్ ప్లానింగ్ 51, మంచి నీటి సరఫరా 1 విభాగాలకు మొత్తం 78 ఫిర్యాదు వచ్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, హెచ్‌ఓ రమేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌ఓ శంకర్‌లింగం, ఇన్‌చార్జ్ సీపీ రవీందర్ రాడేకర్, ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేశ్, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- మడికొండలోని చిల్డ్రన్స్ పార్క్‌లో విద్యుత్ సౌకర్యం, ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయాలని, 64వ డివిజన్ వెస్ట్ సిటీ రెసిడెన్స్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కమిటీ ప్రతినిధులు వినతి పత్రం అందించారు.
- లష్కర్‌సింగారం, కిషన్‌పుర మురికి కాల్వల ఆక్రమణలను తొలగించి పునర్నిర్మించాలని కిషన్‌పురకు చెందిన ఏ.సుదర్శన్ కోరారు.
- 11వ డివిజన్ పరిధిలోని కాపువాడ, మున్నూరు కాపు కాలనీని భద్రకాళి మున్నూరుకాపు కాలనీగా పేరు మారుస్తూ సమస్యలు పరిష్కరించాలని భద్రకాళి మున్నూరు కాపు అభివృద్ధి కమిటీ నాయకులు కొటం ఐలయ్య, లక్ష్మణ్‌రావు, సంజీవ, భద్రయ్య కోరారు.
- బాలసముద్రంలోని సర్దార్ పటేల్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్‌కు చెందిన అప్రూవ్ లేఔట్‌లోని పార్కు స్థలం అక్రమంగా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ రిజిస్టర్ చేశారని దీనిపై చర్యలు తీసుకోవాలని సొసైటీ ప్రతినిధులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.
- భీమారం 55వ డివిజన్‌లోని అలకానందకాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కాలనీ ప్రజలు విన్నవించారు.



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ వాకడే

క్లుప్తంగా

రైల్వే ఇంజనీరింగ్ బ్లాక్‌తో పలు రైళ్ల రద్దు

రేపటి నుంచి జనవరి 9వ తేదీ వరకు..

కాజీపేట రూరల్ : వరంగల్‌-విజయవాడ మధ్య మోటమర్రి సెక్షన్‌లో మూడో రైల్వే లైన్‌, ఇంజనీరింగ్ బ్లాక్‌తో ఈ నెల 25వ తేదీ (రేపటి) నుంచి 2025 జనవరి 9వ తేదీ వరకు కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేసినట్లు కాజీపేట రైల్వే అధికారులు సోమవారం తెలిపారు.

రద్దయిన రైళ్ల వివరాలు..

ఈ నెల 25వ తేదీ నుంచి జనవరి 9వ తేదీ వరకు కాజీపేట-డోర్నకల్ (07753) ప్యాసింజర్, డోర్నకల్-కాజీపేట (07754) ప్యాసింజర్, డోర్నకల్-విజయవాడ (07755) ప్యాసింజర్, విజయవాడ-డోర్నకల్ (07756) ప్యాసింజర్, విజయవాడ-భద్రాచలంరోడ్ (07979) ప్యాసింజర్,భద్రాచలంరోడ్-విజయవాడ (07278) ప్యాసింజర్ రైళ్లు రద్దయ్యాయి.

28వ తేదీ నుంచి మరికొన్ని రైళ్లు..

ఈ నెల 28 నుంచి జనవరి 9వ తేదీ వరకు గుంటూరు-సికింద్రాబాద్ (12705) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-గుంటూరు (12706) ఎక్స్‌ప్రెస్, విజయవాడ-సికింద్రాబాద్ (12713) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-విజయవాడ (12714) రైళ్లు రద్దయ్యాయి. ఇవే కాకుండా కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ మీదుగా ప్రయాణించే మొత్తం 28 రైళ్లు రద్దు, 23 రైళ్లు దారిమళ్లింపు, 3 రైళ్లు రీషెడ్యూల్, కాజీపేట, వరంగల్‌లో 14 రైళ్లకు తాత్కాలిక హాల్టింగ్ ఎత్తివేత, 2 రైళ్లను పార్శిల్లీ రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

వరంగల్ మార్కెట్‌కు రెండు రోజులు సెలవు

వరంగల్: క్రిస్మస్ సందర్భంగా వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు రెండు రోజులు సెలవు ఉందని, ఈ సమయంలో ఎలాంటి క్రయ, విక్రయాలు జరగవని మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25వ తేదీ క్రిస్మస్, 26వ తేదీ బాక్సింగ్ డే ఉన్న నేపథ్యంలో మార్కెట్ బంద్ ఉంటుందన్నారు. ఈవిషయాన్ని రైతులు, వ్యాపారులు గమనించి తమ పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురావొద్దని తెలిపారు.


పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో తమకు పీహెచ్‌డీలో అడ్మిషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ముగ్గురు అభ్యర్థులు మంద నరేశ్, ఎస్.అనిల్, మాలోత్ తిరుపతి నాయక్ సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదానికి దిగారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని, ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ తమ పరిధిలో లేదని మల్లారెడ్డి పేర్కొన్నారు. అనంతరం ముగ్గురు అభ్యర్థులు వీసీ చాంబర్‌లో ఆమరణ దీక్షకు దిగారు. వీసీ ప్రతాప్‌రెడ్డి ఆ అభ్యర్థులతో మాట్లాడారు. ఇప్పుడు పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించడం తన చేతిలోలేదన్నారు. ఉన్నత విద్యాశాఖ నుంచి అనుమతి తెచ్చుకుంటేనే అవకాశం ఉంటుందన్నారు. అయితే తమకు అడ్మిషన్లు కల్పించాల్సిందేనని పట్టుబడుతూ నిరసన తెలిపారు. దీంతో కేయూ సీఐ రవికుమార్, ఎస్సై రవీందర్ ఘటనాస్థలికి చేరుకుని అభ్యర్థులను బయటకు తీసుకొచ్చి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు.



విద్యుత్ దీపాల వెలుగుల్లో దీవి



పర్యాటకులు కూర్చునేందుకు మంచె

బ్లాక్‌బెర్రీ ముస్తాబు..

తాడ్వాయి అడవుల్లో టూరిజం స్పాట్

- మరికొద్ది రోజుల్లోకి అందుబాటులోకి..
- ఆధునిక గుడారాలు ఏర్పాటు..
- ఇసుక మేటల మీద క్యాంప్‌ఫైర్
- బీచ్ వాలీబాల్ తరహా ఆటలకు అవకాశం



ఫారెస్ట్‌లోని బ్లాక్‌బెర్రీ దీవిలో ఇసుక తిన్నెపై ఏర్పాటు చేసిన పర్యాటక గుడారాలు

ఎస్ఎస్‌తాడ్వాయి: చుట్టు ఎత్తైన కొండలు.. కొండల మధ్య నది.. నదిపై పడవలో ప్రయాణం. ఈ అనుభూతి మాటల్లో వర్ణించలేం. బోటులో ప్రయాణిస్తూ కనుచూపు మేర ఉన్న ప్రకృతి అందాలకు పర్యాటకులు ఫిదా కావాల్సిందే. ఇలాంటి సుందర దృశ్యానికి కేరాఫ్ పాపికొండలు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో పర్యాటకులకు ఈ పర్యటన ఎంతో ప్రసిద్ధి. ఎత్తైన పాపికొండలపై పరుచుకున్న దట్టమైన అడవిలో గోదావరి నది ఇసుక తిన్నెల్లో బస చేసే కొల్లూరు హట్స్ ఎంతో ప్రసిద్ధి. అయితే కచ్చలూరు ఘటన తర్వాత ఈ హట్స్‌ను తీసేశారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు పర్యాటకులకు ఆ లోటును తాడ్వాయి అడవుల్లోని బ్లాక్‌బెర్రీ ఫారెస్ట్ భర్తీ చేస్తోంది. తాడ్వాయి - పస్రా మధ్యలో ఉన్న ఏటూరునాగరం అభయారణ్యంలో జలగలంచ వాగు సమీపంలో ఎకోటూరిజంలో భాగంగా అధికారులు గుడారాలను అభివృద్ధి చేశారు. ఇసుక మధ్యలో 50 ఆధునిక గుడారాలు సిద్ధమయ్యాయి. వాగులోని ఇసుక మేటల మీద క్యాంప్‌ఫైర్ అనుభూతిని పొందొచ్చు. బీచ్ వాలీబాల్ తరహా ఆటలకు అవకాశం కల్పించారు. పర్యాటకులు ప్రకృతిలో సేదదీరేలా అన్ని హంగులు రెడీ అవుతున్నాయి. మరికొద్ది రోజుల్లో అందుబాటులోకి రానుంది. రామప్ప, లక్నవరం, మేడారం, బొగత, మల్లూరు వెళ్లే పర్యాటకులు ఇక్కడ ఒక రోజు విడిది చేసి వచ్చని ప్రకృతిలో చక్కని అనుభూతులు సొంతం చేసుకోవచ్చు.



ఏర్పాటు చేసిన రెస్టారెంట్



స్వాగతద్వారం వద్ద విద్యుత్ వెలుగులు



విద్యుత్ వెలుగుల్లో పర్యాటక గుడారాలు

పర్యాటక ప్రాంతంగా బ్లాక్ బెర్రీ దీవి..



బ్లాక్ బెర్రీ దీవిలో చలిమంటలు కాగుతున్న మంత్రి సీతక్క

అటవీ ప్రాంతంలోని బ్లాక్ బెర్రీ దీవిని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఈ మేరకు సోమవారం రాత్రి బ్లాక్ బెర్రీ దీవిని మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ దివాకర్ టీఎస్‌తో కలిసి సందర్శించారు. పర్యాటకుల కోసం ఏర్పాటు చేస్తున్న గుడారాలు, క్యాంప్‌ఫైర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

స్మగ్లర్‌ను హీరో చేశారు.. పోలీసులను విలన్ చేశారు..

- మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క

ములుగు: ఒక స్మగ్లర్ పోలీసును బట్టలు విప్పి నిలబెడితే జాతీయ అవార్డులు ఇవ్వడం దేనికి సంకేతం.. స్మగ్లర్‌ను హీరో చేశారు.. పోలీసులను విలన్ చేశారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. ములుగులో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకల సందర్భంగా ఆమె మాట్లాడారు. సినిమా హాల్‌లో జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన ఘటనను ఆసరాగా తీసుకొని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు సెంటిమెంట్‌ను వాడుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాజకీయ ప్రయోజనం కోసం బీఆర్ఎస్ ముసుగులో సినీ హీరో అల్లు అర్జున్ ఇంటిపై రాళ్లు రువ్వి కొంత మంది రాద్ధాంతం చేయజూస్తున్నారని మండిపడ్డారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని, అల్లు అర్జున్‌పై తమకు ఎలాంటి కోపం లేదన్నారు. లంగతనాలు, దొంగతనాలపై తీసే సినిమాలపై ఎవరూ సానుకూలంగా స్పందించరని, తెలుగు సినీ ఇండస్ట్రీ ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని చూడడం లేదని తెలిపారు.

రేవంత్ పాలనలో ఓరుగల్లుకు ఒరిగిందేమీ లేదు



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు దయాకర్‌రావు, వినయ్‌భాస్కర్, సుదర్శన్ రెడ్డి, నరేందర్, శంకర్‌నాయక్

- సూపర్ ఆస్పత్రి నిర్మాణంలో నిర్లక్ష్యం సరికాదు
- 14 నెలల్లో ఒక్క శాతం పని కూడా పూర్తి కాలేదు
- మాజీ మంత్రి హరీశ్‌రావు



ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

ఎంజీఎం : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంవత్సర పాలన కాలంలో ఓరుగల్లు ఒరిగిందేమీ లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. కేసీఆర్ మొదలుపెట్టిన సూపర్ ఆస్పత్రి ప్రారంభిస్తే మంచి పేరు వస్తుందనే భావనతో 14 నెలల కాలంలో ఒక్క శాతం పనులు కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. సోమవారం సెంట్రల్ జైలు ప్రాంగణంలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తయితే ఒకేసారి 150 మందికి ఐసీయూ చికిత్సలు అందుతాయన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాలకు ప్రజలకు అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు జరిగేలా 33 ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి వస్తాయన్నారు. 2023 అక్టోబర్‌లో పనులు సందర్శించినప్పుడు ఏ విధంగా ఉందో ప్రస్తు తం ఆ విధంగానే ఉందని తెలిపారు. అప్పటికే 84 శాతం ఆస్పత్రి పనులు పూర్తయినట్లు పేర్కొన్నారు. మొదట్లో ఆస్పత్రి నిర్మాణ పనులను 1,750 పడకలు, 16 లక్షల ఎస్ఎఫ్‌టీ(స్క్వేర్ ఫీట్) అనుకున్నా తరువాత కేసీఆర్ నిర్ణయం మేరకు 2,000 పడకలు, 20.50 లక్షల ఎస్ఎఫ్‌టీ మార్చినట్లు పేర్కొన్నారు. అలాగే, ఎంజీఎం నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఈ దుస్థితిపై రోజూ వివిధ పత్రికల్లో కథనలు వెలువడుతున్నాయన్నారు. అయినా ప్రభుత్వం ఆ సమస్యలను పట్టించుకోదు..సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తి చేయదని విమర్శించారు.

ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని పథకాలను బంద్ చేశారని హరీశ్‌రావు పేర్కొన్నారు. దళిత బంధు, చేప పిల్లల పంపిణీ, కేసీఆర్ కిట్, న్యూట్రీషియన్ కిట్టు, రైతుబంధు.. ఇలా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అన్ని పథకాలు బంద్ చేసి కాంగ్రెస్ దద్దమ్మ పాలన సాగిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థతను ప్రశ్నిస్తే బీఆర్ఎస్ నాయకులపై విచారణ, కమిషన్ పేరుతో కేసులు పెడుతూ దుర్మార్గపు పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌లో ఎంతో మంది సీనియర్లు ఉన్నా ఎన్నో పార్టీలు మారిన రేవంత్‌రెడ్డి అందరిని అణగదొక్కుతూ సీఎం కుర్చీలో కూర్చున్నారని విమర్శించారు. రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 24 అంతస్తుల నిర్మాణ పనులను ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం యథావిధిగా చేపడుతుందనే విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు దయాకర్‌రావు, వినయ్ భాస్కర్, నరేందర్, సుదర్శన్‌రెడ్డి, శంకర్‌నాయక్, నాయకులు దాచేపల్లి సీతారాం, దిడ్డి కుమారస్వామి, రమేశ్‌బాబు, ఎండి. షఫీ తదితరులు పాల్గొన్నారు.

వంశీ మృతదేహాన్ని తెప్పించే ప్రయత్నం చేస్తా

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



వంశీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

కమలాపూర్: అమెరికాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వంశీ మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి తెప్పించే ప్రయత్నం చేస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. ఈ మేరకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జయశంకర్‌కు లేఖ రాశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మాదన్నపేటకు చెందిన బండి వంశీ ఉన్నత చదువు కోసం 2022 ఆగస్టులో అమెరికాకు వెళ్లి గత శనివారం అక్కడే అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా, వంశీ కుటుంబాన్ని బీజేపీ మండల నాయకులు సోమవారం పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఫోన్‌లో సంప్రదించి వంశీ కుటుంబ సభ్యులతో మాట్లాడించారు. బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శోభన్‌బాబు, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వర్, మైనార్టీ మోర్చా మండల అధ్యక్షుడు రాజ్‌మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 175 వినతులు..



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

హన్మకొండ అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 175 వినతులు అందాయి. కలెక్టర్ ప్రావీణ్య, డీఆర్ఓ గణేశ్, ఆర్డీఓ రాథోడ్ రమేశ్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి వినతుల పరిష్కారానికి అధికారులు సమయం కేటాయించాలని, ప్రాధాన్యతతో వాటిని పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక జూట్ స్టాల్‌ను కలెక్టర్ ప్రావీణ్య సోమవారం సందర్శించారు. ఇక్కడ ప్రతీ సోమవారం జూట్ ఉత్పత్తుల ఉమ్మకం కేంద్రం ఏర్పాటు చేయాలని, నాణ్యత విషయంలో రాజీలేకుండా చూడాలని మహిళా సంఘాలకు ఆదాయం సమకూర్చేలా స్టాల్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి
కలెక్టర్ డాక్టర్ సత్యశారద

వరంగల్: ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ సత్యశారదతో పాటు అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మీ, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణిలు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 163 దరఖాస్తులు రాగా సంబంధిత శాఖ అధికారులకు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డీసీఓ నీరజ, డీపీఓ కల్పన, డీఎం రాజు, ఉమారాణి పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

జిల్లాలో మత్తు పదార్థాలు, మారకద్రవ్యాల నిరోధకాన్ని సమష్టిగా కృషిచేసి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని కలెక్టర్ సత్యశారద పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో మత్తు పదార్థాల నియంత్రణపై డీసీపీ రవీందర్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ప్రాంతాల్లో నిఘా పెంచి తరచూ పెట్రోలింగ్ చేయాలని డీసీపీకి సూచించారు. విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి(ఇన్‌చార్జ్) మాధవరావును ఆదేశించారు. అనంతరం మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు సత్యాపాల్‌రెడ్డి, ఉమారాణి, డీసీపీ ఈస్ట్‌జోన్ రవీందర్, ఏసీపీలు తిరుపతి, సైదులు, కిరణ్‌కుమార్, డీఎంహెచ్ఓ సాంబశివరావు పాల్గొన్నారు.



కలెక్టరేట్ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న జిల్లా కలెక్టర్ సత్యశారద

కొనుగోళ్ల నిర్వహణకు పటిష్ట చర్యలు

వరంగల్: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తుల కొనుగోళ్ల నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మార్కెటింగ్, వ్యవసాయ, హార్టికల్చర్ శాఖల అధికారులు, వ్యాపారులు, కార్మికులు, కమీషన్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన పంట ఉత్పత్తులు తీసుకువచ్చి గిట్టుబాటు ధర పొందేలా అవగాహన కల్పించాలన్నారు. మార్కెట్ యార్డులో పీఓఎస్ మిషన్లు, పారిశుధ్యం, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో మార్కెటింగ్‌శాఖ జేడీఎం శ్రీనివాస్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అలాగే తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో కలెక్టర్ సత్యశారద పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ



కేయూ క్యాంపస్: పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి తదితరులు



హనుమకొండ బస్టాండ్ జంక్షన్‌లోని పీవీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, నాగరాజు తదితరులు

- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ నర్సింహారావు అని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. యూనివర్సిటీలోని పీవీ నాలెడ్జ్‌సెంటర్ డైరెక్టర్ జి. కృష్ణయ్య అధ్యక్షతన సోమవారం మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 20వ వర్ధంతిని క్యాంపస్‌లోని పొలిటికల్ సైన్స్ విభాగ సెమినార్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ క్లిష్ట సమయంలో దేశాన్ని ఆర్థిక గండం నుంచి గట్టెక్కించిన గొప్ప నేత పీవీ నర్సింహారావు అని కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి, పాలకమండలి సభ్యులు కె.అనితారెడి, ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, డాక్టర్ చిర్రరాజు, కేయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ వి. రాంచంద్రం, కుర్టా అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ. సదానందం, జనరల్‌సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ఆచార్యులు కె. సుధాకర్, పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి సంకినేని వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పీవీకి ఘన నివాళి..

హన్మకొండ చౌరస్తా : హనుమకొండలోని డీసీసీ భవన్‌లో సోమవారం మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నేతలు.. పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హనుమకొండ బస్టాండ్ జంక్షన్‌లోని పీవీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వరంగల్ ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఈవీ శ్రీనివాసరావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, నాయకులు బంక సంపత్, బొమ్మతి విక్రమ్, బిల్ల రమణారెడ్డి, మహ్మద్ అంకూశ్, కుమార్, సురేందర్, రమేశ్, సతీశ్, హరిసింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన పెనుప్రమాదం

- నిర్మాణంలో ఉన్న అండర్‌పాస్ బ్రిడ్జికి ఢీ..
- పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు
- యాదగిరిగుట్ట మండలం వంగపల్లి వద్ద ఘటన



అండర్‌పాస్ బ్రిడ్జి పైకి దూసుకెళ్లిన బస్సు

యాదగిరిగుట్ట రూరల్: హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న అండర్‌పాస్ బ్రిడ్జి పైకి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు దూసుకెళ్లి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్-2 డిపోనకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు సోమవా రం ఉదయం హైదరాబాద్ నుంచి హనుమకొండకు 33 మంది ప్రయాణికులతో బయలుదేరింది. మార్గమధ్యలో యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామం వద్దకు రాగానే అండర్‌పాస్ బ్రిడ్జి పైకి అదుపుతప్పి దూసుకెళ్లింది. ఇనుప చువ్వలను తాకి నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఒకరిమీద ఒకరు పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. దీంతో 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ఈ ప్ర మాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జాతీయ రహదా రిపై సరైన ఇండికేషన్ లేకపోవడంతోనే ప్రమా దం జరిగిందని ప్రయాణికులు ఆరోపించారు.